క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: మీ సేవ కేంద్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని రాజమహేంద్రవరం అర్బన్ మీసేవ సంక్షేమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు అమిత్, రవి కోరారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందించారు. వృత్తి పరంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మీసేవ కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈ కారు ఎవరిదో!



రోడ్డు మధ్యలో ఉన్న కాలిపోయిన కారు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి ఎస్‌టీపీ రోడ్డును కలుపుతూ నిర్మించిన రోడ్డుపై పూర్తిగా కాలిపోయిన కారు కొద్ది రోజులుగా అక్కడే ఉంది. ఈ నెల ఐదో తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఈ కారు కాలిపోయినట్టు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను సైతం అదుపు చేశారు. కారులో ఉన్న వ్యక్తులు బయటకు దిగగానే మంటలు వ్యాప్తి చెందినట్లు తెలుస్తుంది. పెద్దగా జనసంచారం లేని ప్రాంతం కావడంతో కాలిన కారు రోడ్డుపైనే ఉండడంతో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత పోలీసు అధికారులు రోడ్డుపై ఉన్న ఈ కారును పక్కకు తొలగించడమో, లేదా పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



హోమం చేస్తున్న అర్చకుడు, భగవద్గీత పారాయణ చేస్తున్న భక్తులు

పెదపూడి: గ్రామంలోని లక్ష్మీ సమేత జనార్దన స్వామి ఆలయంలో సోమవారం భగవద్గీత హోమం, పూజలు నిర్వహించారు. జ్యేష్ఠ మాసం ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి శ్రీనివాసు, వెంకటగోపాలాచార్యులు ఈ కార్యక్రమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి హోమం, యజ్ఞం, పూజల్లో పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. పూజలు అనంతరం స్వామివారిని విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

శివాలయాలకు భక్తుల తాకిడి



కాపవరంలోని విశ్వేశ్వరస్వామి

మధురపూడి: కోరుకొండ మండలంలోని శివాలయాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. కాపవరంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, కణుపూరులోని భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి దేవాలయాల్లో ఉదయం అభిషేకాలు నిర్వహించారు. కాపవరంలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రసాద వితరణ జరిగింది. ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ త్వరలో ప్రతి సోమవారం అన్నసమారాధనను నిర్వహించేందుకు ప్రయత్నాలు సన్నాహాలు చేస్తోంది.

పంట పండింది..

- కూరగాయల సాగుపై పెరిగిన ఆసక్తి
- ఏటేటా పెరుగుతున్న విస్తీర్ణం



కడియం మండలం దుళ్లలో పచ్చిమిర్చి కోస్తున్న కూలీలు

కడియం: మండలంలో కూరగాయల సాగు విస్తీర్ణం ప్రతి ఏటా పెరుగుతోంది. నర్సరీలు, పూలతోటలను మినహాయిస్తే వరి, చెరకు వంటి పంటలే గతంలో ఎక్కువగా సాగయ్యేవి. గోదావరి లంకలతో పాటు, సమీప మండలమైన ఆలమూరులోని పలు గ్రామాల్లో కూరగాయల పంటలు ఎక్కువగా ఉండేవి. వరి, చెరకు వంటి సంప్రదాయ పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, తెగుళ్లు, నష్టాల నేపథ్యంలో యువ రైతులు ఈ ఏడాది కూరగాయాల సాగుపై ఆసక్తి చూపారు. చెరకు పంట మొత్తం కడియం మండలం పరిధిలో కనుమరుగైపోయింది.

పెరిగిన ఆసక్తి

తక్కువ సమయంలోనే పంటచేతికి అందే వీలుండడం, మార్కెట్‌కు తరలిస్తే ప్రతి రోజూ నగదు చేతికి రావడం, మడికి, మండపేట, రావులపాలెం మార్కెట్‌కు తరలించడం సులభమవ్వడం వంటి కారణాలతో పలువురు కూరగాయల సాగువైపు ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో వరి, చెరకు పంటలను ఎక్కువగా సాగుచేసే మాధవరాయుడుపాలెం, మురమండ, జేగురుపాడు, దుళ్ల, పొట్టిలంక, కడియపుసావరం వంటి గ్రామాల్లో నేడు కూరగాయల సాగు విస్తృతమవుతోంది.

ప్రోత్సాహమిస్తే మరింత విస్తృతం

ఉద్యానశాఖాధికారులు ప్రోత్సాహమందిస్తే కూరగాయల సాగు మరింత పెరిగేందుకు అవకాశముంది. కాపు మొదలైందంటే విడతల వారీగా పెట్టుబడులు వచ్చేస్తాయని, అదే వరి, చెరకు వంటి పంటలైతే పంటకాలం పూర్తయ్యాక గానీ ప్రతిఫలం రాదని కూరగాయాలు సాగుచేసే రైతులు చెబుతున్నారు. ప్రతి రోజూ ఆదాయాన్నిచ్చే అవకాశం ఉండడంతో కూరగాయాల వైపు మొగ్గు చూపుతున్నట్లు వివరిస్తున్నారు. విపరీత వాతావరణ పరిస్థితుల్లో సైతం కూరగాయల సాగులో ఒకటి రెండు కోతలు దిగి, మంచి ధర పలికితే కనీసం పెట్టుబడులు వెనక్కు వచ్చేస్తాయన్న గ్యారంటీ ఉంటుందని చెబుతున్నారు.

500 ఎకరాలకు పైగా..

మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రస్తుతం వివిధ రకాల కూరగాయలు సాగవుతున్నట్టు అంచనా. బెండ, వంగ, దొండ, కాలిఫ్లవర్, టమాటా, పచ్చిమిర్చి, కొత్తిమీర, తోటకూర, గోంగూర, కీరదోసతో పాటు బొప్పాయి, జొన్న వంటి పంటలను కూడా రైతులు సాగు చేస్తున్నారు. బొప్పాయిలో అంతర పంటగా కూరగాయలు, పువ్వులను కూడా పండిస్తున్నారు.

రోజూ డబ్బులు అందుతాయి

కూరగాయల సాగులో ప్రధానంగా ప్రతి రోజూ డబ్బులు అందుతాయి. కడియం మండలానికి సమీపంలోనే రాజమహేంద్రవరం, మడికి, మండపేటలో కూరగాయల హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. కూరగాయలు కోసిన వెంటనే ఏదో ఒక మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకోవచ్చు. వెంటనే డబ్బులు కూడా అందుతాయి. అయితే నిత్యం కూరగాయల తోటలను కనిపెట్టుకుని ఉండాలి. లేకపోతే నష్టం తప్పదు. కాలీఫ్లవర్ సాగు చేశాను. ధర కూడా చాలా బాగుంది. ఇప్పుడు బెండ విత్తనాలు పెడుతున్నాను.

– టి.సూరిబాబు, కూరగాయల రైతు, దుళ్ల

యువకుడి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక నారాయణపురానికి చెందిన విజయ్ కిరణ్ (26) అదృశ్యమైన సంఘటనపై ప్రకాశ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. విజయ్ కిరణ్ ఈ నెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి అప్పన్న దొర పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాహిత..

స్థానిక సుబ్బారావుపేటకు చెందిన వివాహిత అదృశ్యమైన సంఘటనపై ఆమె భర్త మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివాహిత సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని తెలిపాడు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

మధురపూడి: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం హామీలను తప్పకుండా అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఫలితంగా కూటమి అసాధారణ విజయం సాధించిందన్నారు. ప్రజల ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యతను విస్మరించకూడదన్నారు. 2014 –19 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం ప్రజల ఆశలను వమ్ము చేసిందని విమర్శించారు. శ్రామిక వర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడానికి జనసేన నాయకులు కృషి చేయాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం



నెహ్రూనగర్‌లోని ఈద్గా మైదానంలో ప్రసంగిస్తున్న ముస్లిం గురువు



బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం చిన్నారులు

సీటీఆర్ఐ: త్యాగం అనే పదానికి, సర్వసృష్టికర్త అయిన అల్లాపై ఉండే నిజమైన భక్తికి బక్రీద్ పండగ ఉదాహరణ అని ముస్లిం మత గురువులు అన్నారు. బక్రీద్ సందర్భంగా నగరంలోని అన్ని మసీదులు, ఈద్గాలలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నమాజ్ అనంతరం ముస్లిములందరూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

అక్షరాలపై ఇంత నిర్లక్ష్యమా..



సెల్ఫీ పాయింట్‌లో దెబ్బతిన్న అక్షరాలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కంబాల చెరువును ఎంతో అద్భుతంగా ఆధునీకరించారు. సందర్శకుల కోసం పార్కులో అనేక వసతులు కల్పించారు. దాదాపు రూ.13 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ పార్కును 2023 అక్టోబర్‌లో ప్రారంభించారు. దీనిలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను చూసి ప్రజలు కూడా ఎంతో సంతోషించారు. పార్కుకు వచ్చిన సందర్శకులు సెల్ఫీలు తీసుకునేందుకు ఐయామ్ ఎట్ కంబాలచెరువు అనే పాయింట్‌ను నిర్మించారు. వచ్చిన వారందరూ అక్కడ సెల్ఫీలు తీసుకునేవారు. అయితే ఈ సెల్ఫీ పాయింట్‌లోని ఇంగ్లీషు అక్షరాలు ఊడిపోతున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. ఐ అనే అక్షరం ఊడిపోయింది. ఏ, సీ అనే లెటర్లు కూడా దెబ్బతిన్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

గుడ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



రక్తదానం చేస్తున్న గుడ్ ఫ్రెండ్స్ సభ్యురాలు

కంబాలచెరువు: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే లక్ష్యంగా గుడ్ ఫ్రెండ్స్ టీం ముందుకు వెళుతోందని వక్తలు అన్నారు. గుడ్ ఫ్రెండ్స్ టీం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం అర్బన్‌తో పాటు పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జీవీఎస్ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో సత్యసూర్య బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. టీం సభ్యులతో పాటు సుమారు 20 మంది వరకూ రక్తదానం చేశారు. గోకవరం బస్టాండ్, పుష్కరాలరేవు ప్రాంతాలతో పాటు ప్రభుత్వాసుపత్రిలో పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో చిన్నారులకు భోజనం అందించారు. బధిర విద్యార్థుల మధ్యలో కేక్ కట్ చేశారు. టీం సభ్యులు మాట్లాడుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం వేదికగా ఫేస్‌బుక్ ద్వారా దేశవ్యాప్తంగా మిత్రులు, సేవాతత్పరులందరం కలిసి చారిటీ ప్రారంభించామన్నారు.

దీనిద్వారా అన్ని వర్గాల వారికీ సేవ చేయాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో గుడ్ ఫ్రెండ్స్ అడ్మిన్ నాగచక్రం, సతీష్ కుమార్ (అడ్వకేట్), సూర్యప్రకాశ్, సురేష్ బుర్రే, ఆదిలక్ష్మి, స్వీటీ మాధురి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం అంతమయ్యేదెప్పుడో..



రోడ్డుకు పక్కన గుట్టలా వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



ఎస్‌టీ ప్లాంట్ వద్ద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. నగరపాలక సంస్థ అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై ఆంక్షలు విధించినప్పటికీ మార్కెట్‌లో విక్రయాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, ప్లేట్లను ప్రజలు విపరీతంగా వినియోగిస్తున్నారు. అలాగే వాడిన ప్లాస్టిక్ వస్తువులను నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బందికి ఇవ్వకుండా డ్రైనేజీలలోకి విసిరేస్తున్నారు. డ్రైనేజీలలో వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ నేరుగా ఎస్‌టీ ప్లాంట్ వద్దకు చేరుతున్నాయి. నగరపాలక సంస్థ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్లాస్టిక్‌ను తొలగించి, రోడ్డుకు ఇరువైపులా గుట్టలుగా వేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నగరపాలకసంస్థ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుంది.

పిడుగుల కాలం.. జాగ్రత్త అవసరం



పిడుగు పడే సమయంలో వస్తున్న మెరుపులు (ఫైల్)



పిడుగు పడడంతో కాలిపోతున్న కొబ్బరి చెట్టు (ఫైల్)

- చెట్ల కింద ఉంటే ప్రమాదం
- అవగాహనతోనే నష్ట నివారణ

రంగంపేట: వర్షాకాలం మొదలైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వానతో పాటు పిడుగులు కూడా ఎక్కువగా పడుతున్నాయి. ఉన్నట్టుండి వాతావరణంలో అలజడి మొదలైనప్పుడు పిడుగు పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వర్ష సూచన కనిపించగానే చెట్ల కిందకు కాకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం మంచిది.

చెట్ల కిందకు వెళ్లొద్దు

వర్షం పడుతూ పిడుగులు పడే వాతావరణం కనిపించగానే జనాలు ఎక్కువగా అందుబాటులో ఉండే చెట్ల కిందకు వెళతారు. పిడుగు భూమి పైకి వచ్చే క్రమంలో చెట్లు, ఎత్తయిన ప్రదేశాలు, పచ్చిక మైదాన ప్రాంతాలు ఆకర్షిస్తాయి. చెట్టు కాండాలు మంచి శక్తి వాహకాలైనందున దాని కింద నిల్చోవడంతో పిడుగు ద్వారా వచ్చే శక్తి వల్ల మనుషులు కూడా మృతి చెందుతున్నారు.

పలు ప్రమాదాలు

రంగంపేట మండలం ఎస్టీ రాజాపురం, బాలవరం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఒకే రోజు రెండు పిడుగులు పడ్డాయి. బాలవరంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడటంతో కాలిపోయింది. ఎస్టీ రాజాపురంలో కొబ్బరి చెట్టు, చెట్టు పక్కనే ఉన్న ఇంటిపై పిడుగు పడింది. కొబ్బరి చెట్టు కాలిపోవడంతో పాటు ఇంటిలోని విద్యుత్తు మీటర్లు, వైరింగ్, బోర్డులు, గృహోపకరణాలు కాలిపోయాయి. ఇంటి వరండాలో వంట చేసుకుంటున్న మహిళకు పిడుగు షాక్ తగలడంతో వినికిడి శక్తి కోల్పోయింది. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పలుచోట్ల చోటు చేసుకుంటున్నాయి. తాజాగా శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కారణంగా రాజానగరం మండలం సూర్యారావుపేటలో పిడుగులు పడి మూడు ఆవులు మృత్యువాత పడ్డాయి.

అవగాహన అవసరం

పిడుగులు మనుషులపై స్వల్ప, మోస్తారు, అత్యధిక ప్రభావం చూపించే అవకాశం ఉంటుంది. పిడుగుపాటుకు గురి కావడం క్షణాల్లో జరిగిపోతుంది. అప్పుడు ఎవరికీ ఏమీ తోచదు. ప్రమాద బారిన పడిన వారికి చికిత్స ఎంత వేగంగా అందితే అంత సురక్షితంగా ఉంటుంది. తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు గమనించిన వారు బాధితులకు ధైర్యం చెప్పాలి. తీవ్ర ప్రభావం ఉన్నప్పుడు ప్రమాదం చాలా ఉంటుంది. ఈ సందర్భంలో మరణాలే ఎక్కువగా ఉంటాయి. అవగాహన ఉన్న వ్యక్తులు తక్షణం స్పందిస్తే కొంత మేరకు కాపాడే అవకాశం ఉంటుంది.

ఇంటికి ఎర్తింగ్ చాలాముఖ్యం

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల విషయంలోనూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిడుగులు పడే సమయంలో అధిక ఓల్టేజీ వచ్చి విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతింటాయి. దీని నివారణకు ప్రతి ఇంటికీ ఎర్తింగ్ చేయించాలి. ఫ్యూజులకు సరైన రేటింగ్ కలిగిన తీగను ఉపయోగించాలి. ఉరుములు, మెరుపులతో వాతావరణంలో అలజడి మొదలైతే టీవీలు, విద్యుత్తుతో నడిచే ఇతర గృహోపకరణాలను ఆపేయ్యడం మంచిది. విద్యుత్తు బోర్డు నుంచి ప్లగ్‌ను తొలగిస్తే పూర్తి రక్షణ ఉంటుంది.

గుండె మీద ప్రభావం



పిడుగు పాటుతో గుండె మీద అధిక ప్రభావం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో ఆగిన గుండె తిరిగి పని చేసే అవకాశం ఉంటుంది. చేతి దగ్గర నాడి కొట్టుకోకున్నా, మెడ వద్ద నాడి కదలిక ఉంటుంది. అలా ఉందంటే తక్షణమే గుండె తిరిగి పని చేసేలా ఒత్తిడి తేవాలి. నాడి కొట్టుకుంటూ మనిషిలో కదలికలు లేనప్పుడు, గుండెను తిరిగి పని చేయించాలంటే ఛాతీ మధ్య భాగంలో గట్టిగా నొక్కాలి. 5 సెంటీమీటర్ల లోపలి వరకూ బాగా నొక్కాలి. అప్పుడు గుండెకు, మెదడుకు మధ్యలో ఉన్న నాళాల్లో కదలిక వచ్చి హృదయం పని చేస్తుంది. ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో ఇవన్నీ చేస్తే ప్రాణాన్ని కాపాడొచ్చు.

– బి.వేణు శ్రీలక్ష్మి, రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి

జూన్‌లోనూ తగ్గేదేలే..

- విశ్వరూపం చూపుతున్న భానుడు
- కానరాని రుతుపవనాలు
- ఎండలతో ప్రజల అవస్థలు



నగరంలోని ఓ జ్యూస్‌షాపు వద్ద వేచిఉన్న ప్రజలు

సీటీఆర్ఐ: నగరంలో నాలుగు రోజులుగా విచిత్ర వాతావరణం కనిపిస్తోంది. పగటి పూట ఉష్ణోగ్రత అల్లాడిస్తుంటే.. సాయంత్రం మబ్బులు కమ్మి ఆహ్లాదం కలిగిస్తున్నాయి. కాసేపు చిన్నగా వర్షం కురిసినా, ఆ తర్వాత రోజు ఎండ బాదుడు మామూలే. గత సంవత్సరం జూన్‌లో వద్దంటే వర్షాలు. వరుణుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా రబీ పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించారు. కానీ ఈ ఏడాది వరుణుడు మచ్చుకైనా కానరాని పరిస్థితి.

జాడలేని రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు ఈనెల 3వ తేదీన రాష్ట్రంలో ప్రవేశించినట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పుడు జూన్ 17వ తేదీ వచ్చినా వర్షాలు కానరావడం లేదు. వానలతో చల్లగా ఉండాల్సిన వాతావరణం భానుడు భగభగలతో నిప్పులు కొలిమిలా మారింది. ఏప్రిల్, మే నెలలలో సూర్యతాపంతో అల్లాడిన ప్రజలు జూన్‌లో వర్షాలతో సేదదీరవచ్చనుకున్నారు. కానీ రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా ఉక్కబోత కూడా తోడవ్వడంతో చిన్న పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉక్కబోత

పగలు ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి పూట కూడా ఉక్కబోత అధికంగా ఉంటోంది. దీంతో ఏసీలు, కూలర్ల వాడకం బాగా పెరిగింది. సోమవారం ఉష్ణోగ్రత 35 డిగ్రీలు ఉన్నా గాలిలో తేమశాతం 60 శాతం ఉండటంతో ప్రజలంతా అల్లాడిపోయారు. చిరువ్యాపారుస్తులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారంతా చెట్ల నీడ వద్దకు వెళ్లి సేదతీరడం కనిపించింది. సాయంత్రం వేళలో గోదావరి గట్టును ఆశ్రయించి సేదతీరుతున్నారు. మరో మూడు రోజుల పాటు ఎండలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారు.

జ్యూస్ షాపుల వద్ద రద్దీ

ఎండ నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. లస్సీలు, కూల్‌డ్రింక్‌లు, జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, సోడాలు, తాటి ముంజెలు, చెరుకు రసాలకు డిమాండ్ పెరిగింది. ఆయా షాపుల వద్ద క్యూ కుడుతున్నారు. స్థానిక సెంట్రల్ జైలు రోడ్డులో కలర్ సోడాలు, కొబ్బరి బొండాలు, జ్యూస్ షాపులు, చెరుకు షాపులు, తోపుడు బండ్లపైన కుండ లస్సీలు, తాటి ముంజెల వ్యాపారాలు జోరందుకున్నాయి.

మండిపడుతున్న ఎండ

ఉదయం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యమైన పనులు ఉంటే ఎంత తొందరగా పూర్తి చేసుకుని, ఇంటికి చేరుకుంటున్నారు. మధ్యాహ్నం సమయానికి దాదాపు రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత కూడా ప్రజలు బయటికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట కూడా వేడి, ఉక్కబోతతో అల్లాడి పోతున్నారు.

సినిమాలు



శ్యామల : హరోంహర
సూర్యమినీ : చందు చాంపియన్
సూర్యప్యాలెస్ : హరోంహర
స్వామి : మహారాజ
శివజ్యోతి : యేవమ్, సత్యభామ
అనుశ్రీ : మనమే
రాజా : బ్యాడ్ బాయ్స్
ఊర్వశి : రాజధాని రౌడీ
రంభ : ఇంద్రాణి
మేనక : సత్యభామ
అప్సర : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి : మ్యూజిక్ షాప్ మూర్తి

నామవరం

వీఎస్ మహల్ : హరోంహర

ధవళేశ్వరం

మురళీకృష్ణ : మ్యూజిక్ షాప్ మూర్తి

కడియం

వెంకటసూర్య : హరోంహర